క్లుప్తంగా

21న మందకృష్ణ రాక

ఆమనగల్లు: వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో దివ్యాంగుల, ఆసరా పింఛన్ దారుల జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామని సమితి మండల అధ్యక్షుడు శ్రీశైలం మాదిగా మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగా రానున్నారని పేర్కొన్నారు. కావున సభకు జిల్లాలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు భారీగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపలిటీ పరిధి సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రాములు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బాధితుడికి మంగళవారం గ్రామంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ చెక్కు అందజేశారు.

కానిస్టేబుల్ మృతి బాధాకరం

మంచాల: గుండె పోటుతో హెడ్ కానిస్టేబుల్ పసుల వెంకటేశ్(41) మృతి చెందడం బాధాకరమని పీసీసీ సభ్యుడు, ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంచాల గ్రామంలో వెంకటేశ్ అంతిమ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. మృతుడు మంచి క్రికెట్ ప్లేయర్ అని, అందరితో కలివిడిగా ఉండే వ్యక్తని తెలిపారు. భువనగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించేవాడని, అందులో భాగంగా సోమవారం నగరానికి వెళ్లి గుండెపోటుతో కుప్పకూలాడని పేర్కొన్నారు. ఆయన మరణం కుటుంబానికి తీరని లోటన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎద్మా నరేందర్‌రెడ్డి, నాయకులు ఓరుగంటి మహేశ్ గౌడ్, ప్రదీప్‌రెడ్డి, శివగౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో బీఎల్ఓలే కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీపట్నం, మంచాల, యాచారం మండలాల పరిధి 359 పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ అధికారులకు(బీఎల్ఓ) విడతల వారీగా నాలుగు రోజులు శేరిగూడ సమీపంలోని ఇందు కళాశాలలో శిక్షణా తరగతులను నిర్వహించారు. మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించుకోవాలని సూచించారు. లిస్టులో తప్పొప్పులను సరిచేయడంలో బీఎల్ఓలదే కీలకపాత్ర అన్నారు. ఓటర్లకు అందుబాటులో ఉండాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పిల్లలకు ఫోన్లు ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: అతి ప్రేమతో పిల్లలకు తల్లితండ్రులు ఫోన్లు ఇవ్వరాదని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. గంటల కొద్ది మొబైల్స్ చూడడంతో జీవితాలు ఆగమయ్యే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామంలో మంగళవారం గ్రామస్తులతో ఏసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారాం చేసే చిన్నారులకు తల్లి తండ్రులు ఫోన్లు ఇచ్చి సంతోష పర్చుతారని, ఆ సంతోషమే వారికి వ్యసనంగా మారుతుందన్నారు. కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించినా, సేవించినా నేరమేనని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపనతో సరి..





మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన స్థలం (ఇన్‌సెట్లో) శిలాఫలకం

స్త్రీ శక్తి భవన నిర్మాణానికి గ్రహణం

- రెండేళ్లు కావస్తున్నా మోక్షం నున్నా
- ఇబ్బంది పడుతున్న సమాఖ్య సభ్యులు
- 29 సంఘాలకు.. మూడు సొంత భవనాలు

కడ్తాల్: సొంత భవనాలు లేక మహిళా సంఘాల సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. భవనాలు నిర్మించాలని సభ్యులు, నాయకులు కోరిన నేపథ్యంలో 2023 సెప్టెంబర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో గత ప్రభుత్వం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. కానీ అది శంకుస్థాపనకే పరిమితమైంది.

చెట్లకింద.. సమీక్షలు

గ్రామీణ పేదరిక నిర్మూళన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతోంది. కడ్తాల్ మండలంలోని 24 గ్రామాలకు 29 గ్రామైఖ్య సంఘాలు, 758 స్వయం సహాయక సంఘాలు, 8,390 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. మండల పరిధిలో 3 గ్రామైఖ్య సంఘాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా.. మిగతా వాటికి నెలనెలా చెట్లకింద, సభ్యుల నివాసాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సౌకర్యాల లేమితో ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూలు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంతో కీలక పాత్ర వహించే సంఘాలకు.. సరైన వేదికలు లేక లక్ష్యం నేరవేరడం లేదు. సంఘాల కార్యకలాపాల నిర్వాహణతో పాటు మహిళా సమాఖ్యలు, పొదుపు సంఘాల నిర్వహణ, శిక్షణ కార్యక్రమాల్లో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సంఘాల వద్దకు వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే సంఘాల ప్రతినిధులు, సభ్యులు సౌకర్యాల లేమితో సతమతమవుతున్నారు.

స్థానికుల అభ్యంతరం..

మండల కేంద్రంగా 2016లో అవతరించిన కడ్తాల్‌లో నేటికీ మండల సమాఖ్యకు సొంత భవనం లేదు. 9 సంవత్సరాలుగా గ్రామంలోని ఇరుకైన గ్రామ సమైఖ్య భవనంలోనే మండల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంఘాల సభ్యులు, నాయకుల ఒత్తిడితో గత ప్రభుత్వం 2023, సెప్టెంబర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఓ వెంచర్‌లోని జీపీ 10శాతం భూమిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసింది. నిధులు సైతం మంజూరు అయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడానికి వెళ్లగా.. పది శాతం స్థలంలో స్త్రీశక్తి భవనాన్ని ఎలా నిర్మిస్తారని స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేయగా.. అది శంకుస్థాపనకే పరిమితమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఇరుకు గదిలో సమీక్షలు



మండల కేంద్రంలో సౌకర్యాలతో కూడిన మండల మహిళా సమాఖ్య భవనం లేక సంఘం సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం అరకొర వసతులతో, చిన్న గదిలో కొనసాగుతున్న గ్రామాఖ్య భవనంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల సమాఖ్యకు భవనం నిర్మిస్తే సంఘం సభ్యులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– రాజేశ్వరి, ఐకేపీ, ఏపీఎం, కడ్తాల్

ఈజీఎస్ పనుల రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి

డీఆర్‌డీఓ పీడీ శ్రీలత



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ శ్రీలత

కడ్తాల్: ఈజీఎస్‌కు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణను తప్పనిసరిగా చేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీలత అన్నారు. ఉపాధిహామీ 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించారు. మండల పరిధిలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు రూ.2.98 కోట్లతో జరిగిన వివిధ పనులపై, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ తనిఖీ బృందాలు సోదా చేశారు. బృందం సభ్యులు సేకరించిన నివేదికలను చదివి వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ పీడీ మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులను హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలికి రూ.300 వేతనం, సరైన కొలతలతో పనిచేసేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుభాషిణీ, ఎంపీడీఓ సుజాత, ఏపీఓ లలిత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణం పూర్తి



గోవిందాయపల్లి పంచాయతీ కార్యాలయం

కడ్తాల్: మండల పరిధి గోవిందాయిపల్లి గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయింది. కర్కల్‌పహాడ్ గ్రామానికి అనుబంధంగా ఉన్న గోవిందాయిపల్లి పల్లి.. 2019లో నూతన పంచాయతీగా ఏర్పాటు అయింది. అయితే కార్యాలయం లేకపోవడంతో స్థానిక అంగన్‌వాడీ భవనంలో పరిపాలనను నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం.. కొత్త గ్రామాలకు కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా 2023 ఆగస్టులో గోవిందాయిపల్లి భవన నిర్మాణ పనులకు నాటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో భవన పూర్తయింది. భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతుభరోసా ఎందుకు దక్కలేదు?

ఆరాతీసిన రైతు కమిషన్ ఏఈఓలు శ్రీవాణి, రజిత



రైతులతో మాట్లాడుతున్న రైతు కమిషన్ ఏఈఓలు శ్రీవాణి, రజిత

యాచారం: రైతుభరోసా ఎందుకు దక్కలేదు, రుణమాఫీ ఎందుకు కాలేదని రైతు కమిషన్ ఏఈఓలు శ్రీవాణి, రజితలు అర్హులైన రైతులను ప్రశ్నించారు. అందుకు కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కళ్లపల్లి గ్రామంలో వందలాది మంది అర్హులకు రైతుభరోసా, రుణమాఫీ కాలేదని రైతు నరేందర్‌రెడ్డి.. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మంగళవారం అధికారులు గ్రామంలో పర్యటించారు. పలువురు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారి భూ రికార్డులను పరిశీలించారు. వ్యవసాయ భూములను సందర్శించారు. భూ రికార్డులు సక్రమంగా ఉన్నప్పటికీ రైతుభరోసా బ్యాంకు ఖాతాల్లో ఎందుకు జమ కాలేదని అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. రైతులు ఇచ్చిన సమగ్ర సమాచార నివేదికను రైతు కమిషన్‌కు అందజేస్తామని ఏఈఓలు తెలిపారు. న్యాయం చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, రైతులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కడ్తాల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని అసిస్టెట్ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటేశ్, సిద్దమోని శ్రీను, పట్నం శ్రీను, బొమ్మరాజు సత్తయ్య, యాదగిరి, రమేశ్, లక్ష్మణ్, సువర్ణ, బీబీ బేగం తదితరులు ఉన్నారు.

50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ



డీఆర్ఓ సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

మహేశ్వరం: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లాటి యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కులగణన చేపట్టి జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీలకు కేంద్ర కేబినెట్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, రూ.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవాజ్‌యోజన కింద ఎస్సీ, బీసీ, ఎస్టీ కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నర్సింహ, రమేశ్, నరేందర్, రాములు, శంకరయ్య, శ్రీను, రామచంద్రయ్య, రేణుక పలువురు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్

ఆమనగల్లు: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని డీసీపీ రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపదలో ఠాణాకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదేశించారు.

మాజీ సర్పంచ్ మృతి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి

తుర్కయంజాల్: ఇంజాపూర్ మాజీ సర్పంచ్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత బొక్క మన్మోహన్ రెడ్డి సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ రెడ్డి అంత్యక్రియలు మంగళవారం ఇంజాపూర్‌లోని స్మశాన వాటికలో ముగిశాయి.

ఘనంగా తొట్టెల ఊరేగింపు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తొట్టెల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య ఊరేగింపు ఘనంగా కొనసాగింది. అనంతరం పోచమ్మ అమ్మవారికి తొట్టెల కట్టి పూజలు చేశారు. కాలనీ జేఏసీ చైర్మన్ ఎం.వివేకానందగౌడ్, మాజీ కౌన్సిలర్లు ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, అన్ని వర్గాల అభివద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధి వివిధ మండలాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహనిధి పథకం కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు మంగళవారం ఆయన నగరంలోని తన నివాసంలో బాధితులకు అందజేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాములు యాదవ్, మెకానిక్ బాబా, విజయ్ రాథోడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో మండల పరిధి రావిచేడ్ గ్రామానికి చెందిన శివానందకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. అదే విధంగా పలు గ్రామాల బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

24 ఏళ్లుగా అద్దె భవనంలోనే కళాశాల

కాలేజీకి సొంత భవనం నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాలను సందర్శించిన నాయకులు.. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా అద్దె భవనంలో అరకొర వసతుల నడుమ కళాశాల కొనసాగుతోందని తెలిపారు. సొంత భవన నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ.. భూ వివాధం కారణంగా అది నిలిచిపోయిందని పేర్కొన్నారు. అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కళాశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శివ, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

చెన్నారెడ్డిగూడలో గ్రామస్తుల ధర్నా

మంచాల: గ్రామానికి అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామస్తులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బండలేమూర్ నుంచి వయా చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల మీదుగా ఇబ్రహీంపట్టణానికి ఉదయం 7.30 గంటలకు బస్సు వెళ్తుతుందని తెలిపారు. మరలా తిరిగి గ్రామానికి ఉదయం 10–30 గంటల బస్సు ఉందని పేర్కొన్నారు. బండలేమూర్ నుంచి వచ్చే బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటుందని, కనీసం నిలబడి ప్రయాణం చేయలేని పరిస్థితి ఉందని చెప్పారు. కావున చెన్నారెడ్డిగూడకు ఉదయం పూట ప్రత్యేకంగా సర్వీసును తిప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.స్వామి, శాఖ కార్యదర్శులు చంద్రయ్య, పాండు, డీవైఎఫ్ఐ మండల నాయకులు ప్రహ్లాద్, జె.పాండు, ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ, ప్రవీణ్, సుధాకర్, జంగయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారెడ్డిగూడలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

పాత పింఛన్ కొనసాగించాలి



తలకొండలపల్లిలో తపస్ సభ్యత్వ నమోదు చేస్తున్న మణిపాల్ రెడ్డి

ఆమనగల్లు: కాంట్రి బ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను కొనసాగించాలి తపస్ సంఘం మండల అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధి రాంపూర్‌తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో 2025–26 ఏడాది తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 2008 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎలను పీఆర్సీని ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీల తర్వాతే అన్ని కేడర్లకు పదోన్నతులు కల్పించాలని సూచించారు. పెండింగ్ డీఏలు చెల్లించాలని, పీఆర్సీలని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, వెంకయ్య, సంఘం మండల గౌరవ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన ప'రేషాన్'

- కొత్తగా 1,093 ఆహార భద్రత కార్డులు
- 6,103 మంది పేర్ల నమోదు




ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి ఊరట లభించింది. ఇబ్రహీంపట్నం మండలంలో కొత్త కార్డులు (ఆహార భద్రత కార్డులు) వచ్చేశాయి. దీంతో కొత్త కార్డు దారులు, పేర్లు నమోదు అయినవారు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలతో పాటు 14 గ్రామ పంచాయతీలున్నాయి. పాత రేషన్ కార్డులు 18,941 ఉండగా, రేషన్ పంపిణీకి 37 దుకాణాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. కొంత కాలంగా రేషన్ కార్డుల కోసం 2,010 దరఖాస్తులు అందాయి. అందులో 1,093 కుటుంబాలకు కొత్త కార్డులు మంజూరయ్యాయి. ఆయా కార్డుదారులకు సుమారు 3,647 యూనిట్‌గా (కార్డుల్లో ఉన్న ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 6 కిలోల చొప్పున) బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. వివిధ కారణాలతో సుమారు 909 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త పేర్ల చేరిక

పాత కార్డు దారుల్లో కొత్తవారి పేర్ల చేరికకు 4,001 దరఖాస్తులు అందాయి. అందులో 3,824 పేర్ల చేరికతో 6,103 యూనిట్ల బియ్యం అదనంగా ఆయా కార్డు దారులకు దక్కనుంది. మొత్తం కొత్తగా 9,750 యూనిట్ల బియ్యం మండలంలో పంపిణీ చేయనున్నారు. కాగా రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు కేవలం 300లోపు మాత్రమే ఉండటం గమనార్హం. గడిచిన పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులకు గురైయ్యారు. అంతేగాక రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో కార్డులకు మరింత డిమాండ్ ఏర్పడింది. వివిధ కారణాలతో రేషన్ కార్డులు మంజూరు కాని వారు మాత్రం నిరాశతో ఉన్నారు.

నిరంతర ప్రక్రియ



అర్హులందరికీ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇప్పటికి వచ్చిన దరఖాస్తుల్లో 1,093 కార్డులు మంజూరు అయ్యాయి. పాత కార్డుల్లో 3,824 మంది పేర్లను అదనంగా చేర్చాం. ఈ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

– సునితారెడ్డి, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386